## దక్షిణ అమెరికన్ జోకు

ఒక ఇంగ్లీషు జర్నలిస్టు దక్షిణ అమెరికాలో పర్యటిస్తూ ఒక చిన్న దేశానికి వెళ్ళాడు. అతను వెళ్ళిన రోజునే అక్కడ తిరుగుబాటు జరిగింది. జర్నలిస్టు ఒకణ్ణి పిలిచి "మీ దేశంలో చీటికిమాటికి తిరుగుబాట్లు జరుగుతాయేం ?" అని అడిగాడు.

"ఏం లేదు. మాలో ప్రెసిడెంట్లు కావలసినవాళ్ళు ఇంకా చాలామంది న్నారు" అని సమాధానం వచ్చింది.

## పోలిష్ జోకు

ఒక పోలిష్‌వాడి ఇల్లు పోలెండు. రష్యాలమధ్య సరిగ్గా సరిహద్దుమీద వుందిట. అది రష్యాలో వుందని రష్యావాళ్ళు, పోలెండులో వుందని పోలెండువాళ్ళు వాదించుకున్నారు. చివరికి ప్రపంచ న్యాయస్థానంవాళ్ళు అది పోలెండులో దేనని తీర్పు యిచ్చారు. గృహయజమాని చాలా సంతోషపడ్డాడు. ఎందుకంతసంతోషమని ఒకరడగ్గా "రష్యాలో శీతాకాలాలు దుర్భరం. రష్యన్లు తప్ప ఇంకెవరూ ఆ చలికి తట్టుకోలేరు" అని సమాధానమిచ్చాడు.

□□□

"జ్యోతి" పాఠకులను సమ్మోహపరచిన సీరియల్ నవల

సెక్రటరీ

వెల : రు. 8-00

రచన : యద్దనపూడి సులోచనారాణి

ఆగస్టు 15 లోపు మాకు 6/ రూ॥ పంపిన వారికి మాత్రమే రిజిష్టర్డు పోస్టులో పంపబడును

త్వరపడండి!



నవభారత్ బుక్‌హౌస్
ఏలూరురోడ్ - విజయవాడ-2



# కొత్త పువ్వు

సేల్సుమన్ ఒక్కొక్క రకంలో పదేసి చీరలు ముందు పడేస్తున్నాడు. అసలు అన్ని చీరలు చూస్తూంటే కళ్లు జిగేల్ మంటున్నాయి. ఏ చీర ఏరుకోవాలో అర్థం కావడంలేదు. ఒకదాని రంగు నచ్చితే మరొకదాని బార్డరు నచ్చదు. రెండూ నచ్చితే పమిటకొంగు నచ్చదు. ఏది నిర్ణయించుకోవాలో తెలియక తికమకపడి అన్నీ తిరగేస్తూంది యామిని.

"ఊ! త్వరగా నిర్ణయించుకో" అలస్యాన్ని భరించలేక అన్నాడు శైలేంద్ర. "ఏం చెయ్యను. ఒకటి నచ్చితే మరొకటి నచ్చదు." తిరిగి అన్నీ తిరగేస్తూ అంది యామిని.

ఇంతలో ఒక బోయ్ కొన్ని కొత్తరకం చీరలు ఎదుట పడేశాడు. ఆ చీరలలో పైనున్న చీర యామినిని ఎంతో ఆకర్షించింది. వెంటనే అది చూపి "ఆ చీర ప్యాక్ చేయండి" అంది.

"అదా! కొండను త్రవ్వి ఎలకను తీసినట్లు!"

"ఏం దానికేమి ? చక్కని రంగు అందమైన బార్డరు!"

"వద్దు నాకేం నచ్చలేదు."

యామిని అతని వంక చిత్రంగా చూచి "నాకు నచ్చింది." అంది.

"నాకు నచ్చలేదని చెబుతున్నాను" కాస్త గట్టిగా అన్నాడు.

"కానీ కట్టుకునేదిమీరుకాదుగా" మరింత పట్టుదలగా అంది. అప్పటికే కొట్టులో అంతా విచిత్రంగా ఇటు వైపు చూస్తున్నారు. శైలేంద్ర అది గమనించి తలవంచుకుని నెమ్మదిగా "చూడు యామినీ! ప్రత్యేకంగా చూస్తూంటే నాకూ ఆ రంగుఇష్టమే! కానీ అదినువ్వు కట్టుకుంటే నాకు నచ్చదు" అన్నాడు.

యామిని ఏదో అపూర్వ విషయం విన్నదానిలా "వ్వాట్! నేను కట్టుకునే చీర మీకు నచ్చాలా ?" అంది

ఆమె. పెదవుల చివర ఒక విధమైన వెక్కిరింతతో కూడిన చిరునవ్వు మెరిసింది. శైలేంద్ర నిర్ఘాంత పోయాడు ఆ సమాధానానికి. ఆమె చిరునవ్వుకి షాపులో అందరి పెదవులూ వంపులు తిరిగాయి అది గమనించిన శైలేంద్ర ఇక మాట్లాడితే ఆమె హద్దులు మీరుతుందని అనవసరంగా పరువు పోతుందని గుర్తించి తలవంపులుగా 'నీ యిష్టం' ముభావంగా అని గబగబా బిల్లు చెల్లించి బయటకు నడిచాడు. యామిని విజయగర్వంతో నవ్వుతూ 'ప్యాక్ చేయండి' అంది.

● ● ●

గడియారం 12 గంటలు కొట్టి ఆగిపోయింది. కిటికీలోంచి చల్లని గాలి వీస్తోంది. యామిని ప్రశాంతంగా నిద్రపోతోంది. కానీ, శైలేంద్రకు కన్ను మూతపడట్లేదు. అతని మనస్సంతా చికాకుగా వుంది. పదే పదే సాయంత్రం సంఘటనే గుర్తుకు వస్తోంది. అతని మనస్సులో అనేకాలోచనలు తిరుగుతున్నాయి. యామినికి తనపట్ల యెందుకంత నిర్లక్ష్యం? ఏ వొక్కనాడు తన నర్థం చేసుకోడానికి, తన ముచ్చట తీర్చడానికి యెందుకు ప్రయత్నించదు? ప్రతి విషయాన్ని పట్టుదలగా, పెడసరంగా తీసుకుంటుందే? దీనివల్ల తనెంత నొచ్చుకుంటోంది గ్రహించదా, లేక గమనించే కావాలనే నిర్లక్ష్యమా? ఆమె కొరకు తనెన్ని అలవాట్లు మార్చుకున్నాడు! కానీ ఏ చిన్న విషయంలోనూ యామిని తన్ను సంతోషపెట్టదే?

అతనికి పెళ్ళయిన క్రొత్తలో జరిగిన చిన్న సంఘటన గుర్తుకు వచ్చింది. యామినికి, చాలా రకాల కూరగాయలకి బద్ధవైరం, ఆ సంగతి చాలా రోజులదాకా తనకు తెలియదు. ఒకనాడు భోజన సమయంలో సరదాకు తన కంచంలోని కూరను కొద్దిగా యామిని పళ్లెంలో వేశాడు. వెంటనే తింటున్నదల్లా కోపంగా తలెత్తి, తను వారించేలోగానే చేయి కడిగేసుకుని లేచిపోయింది. తన మనస్సు చివుక్కుమంది, ఎంత ఇష్టం లేకపోయినా కనీసం తన సంతోషం కోసమన్నా తిన వచ్చునే! లేదా మంచిగా నచ్చచెప్పవచ్చు -కాని అంత నిర్లక్ష్యంగా లేచి పోవడమా? ఒక్కసారిగా పురుష సహజమైన అహంకారం మేల్కొంది భర్తగా దండించ పోయాడు కానీ ఎటువంటి పశ్చాత్తాపమూ, వినయం లేని యామినినిచూచి అతని మనస్సు వికలమై పోయింది. మారు మాట్లాడక యివతలికి వచ్చేశాడు. అలాగే ... తర్వాత మరి కొన్ని సంఘటనలు. కాని ప్రతిసారి యామినే విజయాన్ని సాధించేది ఆమెని నొప్పించడం ఇష్టంలేక కొంత, ఒక విధమైన నిరాశ నిస్పృహలతో కొంత తాను తలవంచేవాడు. ఇది వరకు సంఘటనలు తా మిద్దరిమధ్యా జరిగినవి, కానీ ఈనాడు అంత





షాపులో పదిమందిముందు తన అభిప్రాయాన్ని, మాటను అంత తేలికగా తీసుకుంటుందని తా నెన్నడూ వూహించలేదు. జరిగిన సంఘటనకు శైలేంద్ర చాలా తీవ్రంగా గాయపడ్డాడు. ఒక్కసారి బాధగా నిట్టూర్చి ప్రక్కకు తిరిగి చూచాడు ఏమీ ఎరగనట్లే యామిని నిద్రపోతోంది. కిటికీలోనుండి వాలుగా పడే చంద్ర కిరణాలు ఆమె పచ్చని ముఖాన్ని మరింత ప్రకాశవంతం చేస్తున్నాయి. గాలికి విశాల ఫాలంమీద నల్లటి కురులు నాట్యం చేస్తున్నాయి. మూసివున్న విశాలమైన కనురెప్పలు, నిద్రలో ఏదో సుఖ స్వప్నాన్ని కని నవ్వుకుంటున్న పలుచని పెదవులు, ఎక్కడి కక్కడ అమరినట్లున్న శరీరపు సొరు, ఆమె నిద్రిస్తున్న తీరు... ఎవరో మహాశిల్పి చెక్కిన శిల్పంలా వుంది. తదేకంగా ఆమె వంక చూస్తున్న శైలేంద్ర చేతులు ఆవేశంతో వణికాయి. మరుక్షణం బాధగా నిట్టూర్చుతూ 'దైహికంగా యింత సౌందర్యాన్ని ప్రసాదించిన భగవంతుడు—ఆమె మనస్సునంతా సౌజన్యంతో నింపకూడదూ' అనుకున్నాడు.

## 2

ఆ సంఘటన జరిగిన రెండు దినాలకు, తిరిగి యింటిలో ఎప్పటి ప్రశాంతత నెలకొన్న తర్వాత ఒకనాటి సాయంత్రం సినిమాకు పోదాం తయారు కమ్మన్నాడు శైలేంద్ర. అతను తయారై హాల్లో కూర్చున్న ఐదు నిమిషాలకు యామిని బయటికి వచ్చింది. తలెత్తి చూచాడు ఆనాడు కొన్న చీర, దానికి మాచ్ అయ్యే జాకెట్టు ధరించింది.

మానుతున్న గాయాన్ని రేవుతున్నట్లయింది ఒక్క క్షణం ఆమెను నిశ్శబ్దంగా చూచి దెబ్బతిన్న అభిమానంతో 'నేనురాను' అని పత్రికలో ముఖం దాచుకున్నాడు. యామిని కోపంతో మండిపడుతూ 'ఏం ఎందుచేత? నేనీ చీరకట్టుకున్నాననేగా! ఆడవాళ్ళ కంటె ఆకాశంలో ఎగిరే పక్షినయం. దాన్ని ఎవరూ శాసించరు, అంది గబగబా. శైలేంద్ర తలెత్తి 'నేను నిన్ను శాసించటం లేదు నాకు తల నొప్పిగా వుంది. రావాలని లేదు' అన్నాడు.

'అవును వుండదు. మొదట బయలేర దీసింది మీరే. ఇప్పుడు వద్దనేదీ మీరే మీరు రావలసిందే' అంది పట్టుగా. శైలేంద్ర మౌనంగా వూరుకున్నాడు పది నిమిషాలు తర్వాత దగ్గరకెళ్ళి అనునయిస్తున్నట్టు 'నా కిష్టంలేని పనిచేసి యెందుకునన్ను నొప్పిస్తావు? వెళ్ళి చీర మార్చుకురా వెళ్దాం' అన్నాడు. 'ఇప్పుడు వెళ్ళకపోతే పోయిందేమీ లేదు. కానీ నేను మార్చను.' అని ఒక్క క్షణం వూరుకొని 'మీకు కోపంవస్తే నేను చెప్పలేనుకానీ మీరా సిమెంట్

"జ్వాల"

కలర్ ఫాంట్ వేసుకుంటే ఘోరంగా వుంటారు. నా కిష్టం లేదంటే అది వేసుకోడం మానేస్తారా' అంది సూటిగా. శైలేంద్ర ప్రామాన్పడి పోయాడు. యామినిలో యెంత అహం, పెంకితనంవున్నా ఈవిధంగా అంటుందనివూహించలేదు. మౌనంగా గదిలోకి వెళ్ళిపోయాడు.

● ● ●

తెల్లవారి శైలేంద్ర నిద్ర లేచే టప్పటికి యామిని పెట్టి సర్దుతోంది. ఒక్క క్షణం ఆశ్చర్యపోయినా, మాట్లాడకుండా బాత్‌రూమ్ కేసి నడిచాడు.

అతనికి కాఫీ అందిస్తూ 'నేను మా వాళ్ళింటి కెళ్లుతున్నాను' అంది ఎటో చూస్తూ. శైలేంద్ర తలెత్తి నిశితంగా ఆమెను చూచాడు. 'అది నీ మారని నిర్ణయమా' అన్నాడు. 'అవును' అంద యామిని. 'అలాంటప్పుడు నా అనుమతి అనవసరం' అన్నాడు. యామిని ఒక్క క్షణం అట్లాగే నుంచుని లోపలకు వెళ్ళి పోయింది.

శైలేంద్ర బాధగా నుదురు నిమురుకున్నాడు. ఈ సంగ్రామానికి అంతం యెక్కడో అతనికి అర్థం కాలేదు. నిజానికి శైలేంద్రకు యామిని అంటే విపరీతమైన అనురాగం. ఆమె కొరకు తనకి అమిత యిష్టమైనవీ, ఆమె కెంత మాత్రం యిష్టంలేని అలవాట్లను మార్చుకున్నాడు సాధారణంగా ఎంతో లోతుకు వెళ్తేగాని ఆమెను నొప్పించడు. తర్వాత లేచి గదిలోకి వెళ్లాడు. యామిని యథాప్రకారం సర్దుతూంది. నెమ్మదిగా వెళ్ళి ఆమె భుజంమీద చెయ్యివేసి 'చూడు యామినీ! చిన్న, చిన్న విషయాలవల్ల బ్రతుకులోని మాధుర్యాన్ని చెడగొట్టుకో కూడదు. చిన్న చిన్న పొరబాట్లు భార్య భర్త లిరువురిలోనూ సమానమే. సర్దుకునే ఓర్పుండటం యెంతైనా అవసరం. చదువుకున్న దానివి నీ కింతకన్న నే చెప్పగలిగేదేమీ లేదు.' బాధగా అని వెళ్ళిపోయాడు. స్నానానంతరం అతను తిరిగి వచ్చేటప్పటికి యామిని యథాప్రకారం సర్దుతూనే వుంది. శైలేంద్ర యేమీ మాట్లాడలేక బాధగా నిట్టూర్చి ఆఫీసు కెళ్ళి పోయాడు

ఆ సాయంత్రం 'అనివార్య కారణాల'వల్ల తాను స్వయంగా యామినిని రైలెక్కించలేక పోయాడు. ఆ సంఘటన యామినిలోని అభిమానాన్ని మరింత ప్రజ్వరిల్ల జేసింది. అనుకున్న ప్రకారం యామిని బయల్దేరి వెళ్ళి పోయింది!

## 3

యామిని వెళ్ళిపోయిన ఓ ఇరవై రోజుల తర్వాత ఒకరోజు వాకిట్లో బండి ఆగిన చప్పుడు విని 'స్టౌ' ముందు నుండి లేచివచ్చాడు శైలేంద్ర. బండి లోంచి దిగుతున్న కుముదని చూచి సంతోషంతో 'రా, కుముదా! వుత్తరమన్నా వ్రాయలేదేం? అంతా కులాసా?' అంటూ దారి తీశాడు. ఇంట్లోకి వచ్చిన తర్వాత 'వెళ్ళి కాళ్ళు కడుక్కురా కాఫీ తాగుదువుగాని' అని







ఆమెని పంపి స్టౌమీద గిన్నె దించి పాలు పెట్టాడు. బాత్‌రూం లోంచి తిరిగి వచ్చిన కుముద ఆశ్చర్యంగా 'అదేమిటి అన్నయ్యా! వదినేది కనపడట్లేదే?' అంటూ తాను స్వయంగా వెళ్ళి కాఫీ కలపసాగింది.

శైలేంద్ర ముభావంగా 'వృట్టి టి కెళ్ళింది' అని నిస్సత్తువగా కుర్చీలో కూర్చున్నాడు. 'ఆ దేమిటి అన్నయ్యా అలా వున్నావు' అంటూ కాఫీ అందివ్వబోయింది. 'నాకు వద్దమ్మా నాల్గు రోజుల్నుండి జ్వరం వస్తోంది. ఈ రోజు పథ్యం తీసుకుందామని ప్రయత్నిస్తున్నాను.' ఆ మాటతో కుముద ముఖం ముడుచుకుపోయింది. 'అలా వున్నపుడు వదిన్ని వెంటనే రమ్మని వైర్ యివ్వలేక పోయావా?' అంది. 'ఆ! ఎందుకనవసరంగా కంగారు పెట్టటం?— నీ పరీక్ష లయ్యాయా' అని మాట మార్చేశాడు. కుముద సమాధానాలు చెబుతున్నా మనసులో నొచ్చుకుంది.

● ● ●

రెండు రోజుల తర్వాత ఆనాటి సాయంత్రం ఆఫీస్ నుంచి వచ్చి కాళ్ళు చేతులు కడుకుని టవల్‌తో తుడుచుకుంటూ వచ్చేటప్పటికి కుముద హాలులో వాజులో వాడిపోయిన పూలను తీసి కొత్తరకం కాగితం పూలు సర్దుతోంది.

'ఎక్కడకొన్నావు కుమూ! చాలా బాగున్నాయి' అన్నాడు.

'నేనే తయారు చేశానన్నయ్యా. బాగున్నాయా!' అంది సంతృప్తిగా. శైలేంద్ర ఆ మాటలు వినలేదు. అతని మనస్సెక్కడో వుంది. ఏదో ఆలోచనతో 'వీటికీ, యామినికి తేడా యేమిటి?' అనుకున్నాడు బాధగా. కాని అప్రయత్నంగా అతని వేదన బయటకు వచ్చింది. పూలు సరిగా సర్దుతున్న కుముద పిడుగుదెబ్బతిన్న దానిలా 'ఏమిటన్నయ్యా ఆ మాట?' అంది. శైలేంద్ర విరక్తిగా నవ్వి 'భగవంతుడు మంచుబిందువులోని స్వచ్ఛతను, పువ్వులోని మకరందాన్ని, కోయిలపాటలోని తీయదనాన్ని, కలిపి స్త్రీగా సృజించాడని విన్నాను. ఆ స్వచ్ఛతలో ఎదుటివారి మలినాన్ని కడిగి వేస్తుందని ఆ తీయదనంతో గృహంలో తేనెవాగులు ప్రవహింపజేస్తుందని, ఆ మధురిమతో మనసారా ఆదరిస్తుందని చదివాను. కానీ కథలకీ, వాస్తవానికి చాలా దూరముంటుందిగా!' ఏమి మాట్లాడుతున్నాడో తెలియకుండానే అనేశాడు. కుముద బాధపడింది. అన్నయ్య వేదన తీరటమెట్లా? చివరకు 'పొరబాటన్నయ్యా! వదిన్ని నీవు సరిగా అర్థం చేసుకోలేదేమో!' అంది.

'లేదు కుమూ! అనుక్షణం అర్థం చేసుకోవాలనే ఆరాటపడ్డాను. ఆమె తప్పుల్ని మృదువుగా మందలించాను. నిండు హృదయంతో ఆరాధించాను. కానీ ఆ అహంకారం ముందు, నిర్లక్ష్యం ముందు అన్నీ బూడిదలో పోసిన పన్నీరయ్యాయి. ఇక జీవితంలో ఆమె దగ్గరనుంచి నేనేం పొందగలనో, ఆమె కేమి యివ్వగలనో అర్థం చేసుకోలేక పోతున్నాను.' అతని కంట్లో సన్నని నీటి తెర కదలాడటం కుముద చూచింది. ఏమీ అనలేక దిగులుగా చూస్తూ వుండిపోయింది. క్షణం తర్వాత శైలేంద్ర తెప్పరిల్లి 'ఆ టిఫిన్ తీసుకురా' అన్నాడు. కుముద భారంగా లోపలకు వెళ్ళింది.



# 4

ఆ రాత్రి పడుకుందన్న మాటేగాని కుముదకు నిద్రపట్టలేదు. అన్నయ్య దాంపత్య జీవితం విచ్ఛిన్నమైందా? అన్నయ్య సుఖ స్వప్నం కరిగిపోయిందా! దీనికి కారణం ఎవరు? కేవలం వదినేనా బాధ్యురాలు? లేక అన్నయ్యదా తప్పు? అన్నయ్య ఆదరాన్ని, అనురాగాన్ని వదిన యెందుకు గుర్తించటం లేదు? సాధారణంగా ఎక్కడో కానీ కనపడని సుగుణాలకు నిలయం అన్నయ్య! అటువంటి వ్యక్తి విశాల హృదయాన్ని ఎందుకు మన్నించదు? చీటికీ, మాటికి యెందుకు నొప్పిస్తుంది? స్త్రీ తన జీవితంలో కోరుకునేది, కలలుకనేది భర్త ఆదరానురాగాలేకదా! అందరికీ సామాన్యంగా లభ్యంకాని ఈ అదృష్టాన్ని వదిన యెందుకు కాలదన్నుకుంటోంది. లేక అన్నయ్యనుండి మరేదయినా వాంఛిస్తోందా? కాంక్షించినా తీర్చలేనివాడు కాదే!

ఆలోచనలతో బుర్ర వేడెక్కిపోయిన కుముద లేచి తలుపుతీసి వరండాలో కొచ్చింది. వరండాలో నుండి శైలేంద్ర పడగ్గది కన్పిస్తోంది. ఏం చేస్తున్నాడో చూద్దామని కిటికీ వారగా నిలబడింది. గదిలో 'లైట్' లేదు. టేబిల్ పైనున్న యామిని ఫొటోపై వెన్నెల కిరణాలు జాలువారుతున్నాయి. ఆ ఫొటో ముందు నలిగిన నాలుగు సన్నజాజులున్నాయి. శైలేంద్ర వాలుకుర్చీలో కూర్చుని ఆ ఫొటోవంక తదేకంగా చూస్తున్నాడు. అతని కన్నుల్లో బాధ స్పష్టమవుతూనే వుంది. కుముద గిలగిలా కొట్టుకుంది. అలికిడికి యిటువైపు తిరిగిన శైలేంద్రకు వరండాలో కుముద కన్పించింది ఒక్కక్షణం తెల్లబోయినా, వెంటనే బయటకువచ్చి 'చీకట్లో ఒక్క దానవూ ఏం చేస్తున్నావు కుమునా!' అన్నాడు.

కుముద తడబడి 'గాలిలేదన్నయ్యా, అందుకని' అబద్ధం! కాని అనాలోచితంగా అనేసింది. శైలేంద్ర వింతగా నవ్వి 'ఒకరి జీవితాల గూర్చి ఒకరు ఆలోచించి చెయ్యగలిగే దేమీ లేదు కుమూ. మనస్సు పాడవటం తప్ప. ఎవరి బ్రతుకుల్ని వారే చక్కదిద్దుకోలేక నాశనం చేసుకుంటున్నపుడు ఒకరు చెయ్యగలిగిందేమీ లేదు. పోయి పడుకో' అన్నాడు బాధగా. కుముద కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. అపుకోలేక 'లేదు. లేదు. వదిన్ని క్షమించన్నయ్యా. వదిన తన తప్పు తాను తప్పక తెలుసుకుంటుంది. నిన్ను సుఖపెడుతుంది' అంది.

'శిలను యెంత కరిగించినా అమృతం బయటపడదు. తీగలు లేని వీణను యెంత పలికించినా సరిగమలు పలుకవు కాగితం పువ్వు యెంత ప్రయత్నించినా పరిమళించదు. స్త్రీ సహజమైన లాలిత్యం

కరువైనవుడు ఒకరు కోరేది, వారు ఇవ్వదగ్గదీ ఏమీ వుండదు. అనవసరంగా మనస్సు పాడు చేసుకోకు. పోయి పడుకో!" అన్నాడు శైలేంద్ర.

కుముద బాధగా వెనక్కి తిరిగి వెళ్ళిపోతూ "లాభంలేదు. అన్నయ్య మనస్సు విరిగిపోయింది" అనుకుంది.

పోతున్న కుముదను చూచి "స్త్రీలోని క్షమా గుణానికీ, ఔదార్యానికి ప్రతినిధియైన ఈమె కుమల్లేనే అందర్నీ యెందుకు సృజించవు భగవాన్!" అనుకున్నాడు శైలేంద్ర.

## 5

గుమ్మంలో అడుగుపెట్టిన అడబిడ్డను చూచి అన్నయ్య యెంత ఆశ్చర్యపడ్డాడో వదినగారూ అంతే. కానీ యామినికి కుముదరాక చాలా ఆనందాన్ని కలిగించింది. అత్తవారింట్లో శైలేంద్ర తరువాత చనువున్నది కుముద దగ్గరే. ఆదరంగా "రా కుముదా" అని అప్యాయంగా ఆహ్వానించింది. అన్నయ్యలోని మార్పు వదినలోనూ కన్పిస్తుందని ఆశించిన కుముద నిరుత్సాహపడ్డది.

ఆ రాత్రి భోజనానంతరం వదినా మరదళ్ళు చల్లగాలికికూర్చుని కబుర్లు చెప్పుకుంటున్నారు. ఏమిటో యాంత్రికంగాసాగిపోతున్నరోజుల్లో కుముదరాక ఎంతో రిలీఫ్ ఇచ్చింది యామినికి. ఉత్సాహంగా ఎన్నో కబుర్లు చెప్పుకు పోతోంది. కుముద వదిన ప్రవర్తనకి ఆశ్చర్యపోతోంది. మానసికంగా బాధపడుతోంది.

తాను అన్నయ్య దగ్గర నుండి వచ్చానని చెప్పినా కూడా ఒక్క మాట భర్తగూర్చి కనీసం ఆరోగ్యం గూర్చి అడక్కపోవడం తన కేమన్నా కబురు చెప్పాడా అని కుతూహలం చూపక పోవడం కుముదకు చాలా విచారాన్ని కలిగించింది వదిన వాక్ప్రవాహానికి అనకట్ట వేస్తూ "ఆ! నేను వెళ్ళేటప్పటికి అన్నయ్య నాల్గు లంఘణాలు. ఆ రోజే నార్మల్‌కి వచ్చిందట. పాపం తనే చెయ్యి కాల్చుకుంటున్నాడు" అంది, ఆమె దృష్టిని ఆ వైపు కేంద్రీకరింప చేయాలని. ఆ వార్త యామినిమీద ఎటువంటి ప్రభావాన్ని కలిగించలేకపోయింది. కానీ 'తానే చెయ్యి కాల్చుకుంటున్నా'డన్నపుడు మాత్రం ఒక్క క్షణం గిలగిల లాడింది మనస్సు. కాని సర్దుకుని "అలాగా! సరేగాని ఆ మధ్య పత్రికలో పడ్డ 'స్వర్గసీమ' సీరియల్ చదివావా! పాత్ర పోషణ బాగుంది కదూ" కుముద హృదయంపై బలమైన సమ్మెట దెబ్బ తగిలినట్లయింది. ఆ తర్వాత ఆమెకు మాట్లాడబుద్ధి వేయలేదు. యామిని మాటలు ఒక్కటి కూడా చెవి కెక్కట్లేదు. కొంతసేపు గడిచిం తర్వాత "ఇక పడుకో కుమూ. వస్తాను" అంది యామిని.

కుముద భారంగా లోపలకు నడిచింది. వెన్నెలలో సన్నజాజులు పచ్చటి ఆకులమధ్య మెరుస్తున్నాయి. కిటికీలోంచి గాలి వాటి సువాసనలు మోసుకొస్తూంది. ప్రక్కమీద వాలిపోయిన ఒక్క క్షణం తర్వాత "ఈ సన్నజాజులకన్న సున్నితమైన అన్నయ్య మనస్సు నెందుకు నొప్పిస్తావు వదినా!" అంటూ బరువుగా కళ్ళువాల్చింది.

వారంరోజులు గడిచాయి. ఈ వారం రోజుల్లోనూ ఎన్ని సంభాషణలు దొర్లినా తాను చెప్ప దలచుకున్నది చెప్పలేక పోయిందికుముద. ఏమని చెబుతుంది? తానా అవివాహిత. భర్తని సేవించమని, ప్రేమించమని అతని మనస్సు నొప్పించకని చెప్పటమా? అది సబబుగా వుంటుందా, వదిన నొచ్చుకుంటుందేమో లేక కోపబుచ్చుకుని తన్ను చిన్నబుచ్చుతుందేమో? అసలు తానెందుకు వచ్చింది ఇక్కడికి? అన్నయ్య ఆవేదనను చూడలేక. ఏదో చేయాలని వెర్రి తపనతో ఆవేగంతో వచ్చింది. కానీ అది అంత సులభమా? ఎన్నోసార్లు ఏమిటో చెప్పాలని ప్రయత్నించి చెప్పలేక పోయింది.

కుముద రోజులు భారంగా గడుస్తున్నాయి. కుముద మానసిక వేదనకి తోడు యామిని ఉత్సాహం, భర్తని గూర్చి ఎటువంటి ఆలోచన పట్టించుకోక పోవడం మరింత బాధిస్తున్నాయి. ఏమైనా తానిక వుండకూడ దనుకుంది. అయినా తన సెలవులు కూడా అయిపోవచ్చాయి. మర రెండు రోజుల తర్వాత ప్రయాణం కట్టింది. వెళ్ళే రోజున కూడా ఏదో చెప్పాలని మనసులో ఏదో ఆరాటం. ఆడబిడ్డను రైలెక్కించటానికి స్టేషన్‌కి వచ్చింది యామిని. రైలు బయల్దేరుతున్న వేళలో ఏం చెప్పాలో అర్థంకాక, తన ఆవేశాన్ని అణచుకోలేక వదినగారిచెయ్యి మృదువుగా నొక్కుతూ "అన్నయ్య దేముడిలాంటివాడు. అతని మనస్సు నొప్పించకు వదినా" అంటూ బండెక్కింది. యామిని తెల్లబోయి తలెత్తింది. కుముద కళ్ళనిండా నీళ్ళున్నాయి!

## 6

పదిహేను రోజులు గడిచాయి దీపావళి దగ్గరకు వచ్చింది. ఆ పండు



గకు యిద్దరల్లుళ్ళనూ ఆహ్వానించా లను కున్నాడు యామిని తండ్రి. ఆయన రెండవ అల్లుడు సుందర్ దక్షి ణాదిన ఇంజనీర్.


ఇందిర పెళ్ళయి నాళ్ళు మాసా లయిందేమో! పెళ్ళయిన పది రోజు ల్లోకే భర్తతో వెళ్ళిపోయింది. తిరిగి యింతవరకు పుట్టింటికి రాలేదు. చెల్లెలు వస్తోందన్న ఆనందంతో బాటు అది యింతకాలం పుట్టింటికిరాకుండా ఎలావుందా అన్న ఆశ్చర్యం కూడా కలెత్తింది. ఆ ప్రశ్నే తల్లిని వేసింది

'ఏమోనమ్మా! ఎపుడు వ్రాసినా నే వస్తే వారికి యిబ్బంది, తిండీ అదీ కుదరదు,రాననేసమాధానం. అయినా పెళ్ళయ్యే దాకనే కానీ కట్టుమనిపది రోజులుండలేరే ఆడపిల్లలు' అంది. యామినికి నవ్వు వచ్చింది. తను పెళ్ళయిన సంవత్సరంలో ఆరు మాసాలు ఇక్కడే గడిపింది. ఇప్ప టికీ రెండునెల్లకోసారి గాలి యిటు మళ్లుతూనే వుంటుంది. చిన్నగా నవ్వు కుంది. మామగారు వ్రాసిన జాబుకు మర్యాదకి భంగం లేకుండా "తనకు సెలవు లేదనీ, వీలుంటే వస్తాననీ, యేమీ అనకోవద్దని' వ్రాశాడు శైలేంద్ర. తండ్రి యిచ్చిన వుత్తరం చూచి యామిని భగ్గుమంది. "సెలవు లేకకాదు! పట్టుదల. మగవాడిననే ధీమా. హు! నేనూ చూస్తాను. ఎంత కాలం కొనసాగిస్తారో" అనుకుంది తనలో.

పండుగ రెండురోజు లుందనగా సుందరం, ఇందిర దిగారు. పరుగున వీధిలోకి వెళ్ళిన యామిని చెల్లెల్ని చూచి నివ్వెరబోయింది. ముదురు ఆకుపచ్చరంగు చీరె, తల నిండా పువ్వులు, ముక్కుకి ముక్కు పుడక పదహారణాల పల్లెపడుచులా దిగింది. 'ఆదేమిటక్కా! అలా నిల బడిపోయావు' అంటూ ఇందిరే ముందు పలుకరించింది. 'ఓహో! వదినగారు ముందే వచ్చారే! అన్నగారేరీ!' అంటూ సుందరం నవ్వుతూ లోపలికి వచ్చాడు. అతడు చాలా సరదా పురుషుడు. ఎప్పుడూ చిలిపి నవ్వులు నవ్వుతూ చలాకీగా మాట్లాడుతుంటాడు. శైలేంద్రలో కన్పించే గాంభీర్యం, నిదానం యిత నిలో మచ్చుకైనా కనిపించవు. యామిని సమాధానం చెప్పటంలో తడబడింది. ఆమెలో నివ్వెరపాటు తగ్గలేదింకా. ఇందిర యామినికంటె ఒక్క ఛాయ తక్కువ. యామిని లోని ఆకర్షణ, అందం ఇందిరలో లేవనే చెప్పాలి. కానీ చిరునవ్వు ఆమె పెదవుల నెప్పుడూ వీడదు.

ఆ మధ్యాహ్నం అక్కా చెల్లె ళ్ళిద్దరూ తీరికగా కూర్చున్నపుడు 'నీవు చాలా మారిపోయా విందిరా! ఎప్పు డైనా యింత ముదురు రంగులు కట్టుదానివా! ముక్కుకా పుడ కేమిటి అమ్మమ్మలా!' అంది యామిని చిరుకోపంతో. ఇందిర ఫక్కుమని నవ్వింది. 'అవునక్కా! ఒకొకపుడు నన్ను చూస్తే నాకే ఆశ్చర్యం వేస్తుంది. కానీ ఏం చెయ్యమంటావు చెప్పు. ఆయన






కదేమో ఆ ముదురురంగులే యిష్టం. నాకు నచ్చవండీ అన్నా 'నా కంటికి నచ్చినప్పుడు యితరుల ప్రమేయ మెందుకు' అంటారు. ఆయన కిష్టం లేని పనిచేసి ఆయన్ని నొప్పించట మెందుకు చెప్పు! అందుకే అలవాటు పడిపోయాను. ఇక ముక్కుపుడ కంటావా. అదీ ఆయన అభిరుచే! అది పెట్టుకుంటే బృందావనిలో రాధలాగుంటానట. ఆయన కంత ఆనందం చేకూర్చేపని యెందుకు మానేయాలి, వాళ్ళ సంతోషంమనకు

మాత్రం ఆనందదాయకంకాదా' అని తలెత్తి అక్క ముఖంలోకి చూచింది. యామిని కళ్ళల్లో జీవంలేదు. తన చెల్లెలేనా యిలా మాట్లాడుతోంది. బి. ఎ. క్లాసులో పాస్ అయిన ఇందిర ఒక పురుషుడి భావాలకు, కోరికలకు 'గంగిరెద్దు'లా తలాడిస్తోంది. యామినిలో ఒక భావం ఛీత్కారం చేసింది కొన్ని క్షణాల తర్వాత 'పూ, నీ కార్యక్రమమేమిటి? ఎలా పొద్దు పోతుంది. ఏదైనా క్లబ్‌లో గాని చేరావా!' అంది. 'పనిలేనపుడే కాలక్షేపంకూడా వుండదు. నిజానికి నాకు చాలా చక్కగా గడుస్తుంది.

'ఈ స్వల్పమయిన జీవితకాలం వృధాగా పోనివ్వకు. చేయదలచుకొన్న సత్కార్యం యిప్పుడే చేసేయి' మన్నాడో కవి. కల్పించుకోవాలిగాని యెన్నిపనుల్లూ, ఎన్ని అభిరుచులుంటాయో చెప్పక్కా!

మధ్యాహ్నం పూట కొద్దిసేపు మనోవికాసానికి లైబ్రరీ బుక్స్ చదువుతా! ఇక క్లబ్ అంటావా నాకటువంటి వాటిపట్ల అంత శ్రద్ధలేదు. తీరా వెళ్ళితే జరిగేవి 'ఈ చీర యెంతకొన్నారు? ఆ ముడి యెల్లా చుట్టారు' యివేగా కబురు. ఇటువంటి పోసుకోలు కబుర్లంటే నాకసహ్యం. సాయంత్రం అలిసిపోయి ఆయ నింటికి వచ్చేవేళకి ఆప్యాయంగా గుక్కెడు కాఫీ అయినా యివ్వకుండా ఏం బావుకుందామని అక్కడకు పోవడం?' యామినికి ఇందిర ఒక్కొక్క మాట ఒక్కొక్క వింత విషయంగా వుంది. ఈమె తన చెల్లెలు ఇందిరేనా? ఆమె స్వయంగా యిలా మారిందా? లేక అతను మార్చాడా? ఏ మహామంత్రశక్తిచేత అతను ఇందిర హృదయంలో మరే విషయానికి ప్రాధాన్యం లేకుండా చేసి తనవైపు ఆకట్టుకో గలిగాడు? యామిని ఆలోచనలు సాగుతూనే వున్నాయి. ఇంతలో సుందరం గదిలోంచి చిన్న దగ్గు వినిపించింది. అది విన్పించిన నిమిషం తర్వాత ఇందిర 'ఇపుడే వస్తా నక్కా' అంటూ వెళ్ళింది. ఆ వెళ్ళడం వెళ్ళడం మళ్ళీ రాలేదు. గదిలో నుండి మాటలు, నవ్వులూ విన్పిస్తున్నాయి. చూచి చూచి విసుగెత్తి యామిని క్రిందకు వెళ్ళింది.

ఆ తరువాత రెండురోజులూ కూడ ఇందిర యామినితో ఎక్కువసేపు గడపలేక పోయింది. ఎప్పుడూ భర్తతోనే ముచ్చటలాడ్తూ కూర్చునేది. అబ్బ. అన్ని మాటలేముంటాయో? యామినికి విసుగూ, కోపం వచ్చేవి. తెల్లవారి లేచిన దగ్గరనుండి అతని వెన్నంటి అతని అవసరాలన్నీ తీరిస్తే కాని యివతలకి వచ్చేదిగాదు. యామిని కివన్నీ చిత్రంగానూ, కొంత పరిహాసంగానూ, మరికొంత ఏదో తెలియని బాధగానూ తోచాయి. ఆమెకి చాలాకాలానికి కల్సుకున్న చెల్లెలుతో ఏవో విషయాలు మాట్లాడాలనే, సరదాగా గడపాలని కోర్కె. కాని ఇందిరకి ఆ నిన్నాళ్ళకి పుట్టింటికి వచ్చానన్న ధ్యాసేలేదు. ఎంతసేపు అతనిసేవా - అతనితో ముచ్చట్లు! యామినికి తమ పెళ్ళి క్రొత్తలో జరిగిన సంఘటన గుర్తుకువచ్చింది. అప్పటికి వివాహమై నెలరోజులు దాటిందేమో! ఏదో శెలవులకి శైలేంద్ర వచ్చాడు. సాధారణంగా ఏవో కబుర్లు చెబుతూ గది దాటనిచ్చేవాడు కాదు. తనకు విసుగనిపించినా మర్యాదకు కూర్చునేది. ఆ రోజు మధ్యాహ్నం ఎవరో స్నేహితురాలొచ్చిందని తెలిసి గంపెడు సంతోషంతో ఏదో బందిఖానా వదలినట్లు భావిస్తూ లేచి వెళ్ళింది కాని పట్టుమని పది నిమిషాలైనా గడవకముందే ఇందిర వచ్చి 'బావ పిలుస్తున్నా'డంది. స్నేహితురాలు కొంటెనవ్వుతో 'నే వెళ్తాలే యామినీ. పాపం మీ శ్రీవారికి బాధగా వున్నట్లుంది?' అంటూ లేచింది. తనకి చాలా కోపం, అసహ్యం కలిగాయి. 'అక్కర్లేదు. ఇపుడే వస్తాను కూర్చో. రాక రాక వచ్చావు' అని పైకి వెళ్ళి కొద్దిగా కోపంతో 'ఏమిటిది ఎవరో వచ్చారని తెలిసి కూడా' అంది. 'మాట్లాడావుగా. ఇక చాల్లే లేకపోతే ఇందిర మాట్లాడుతుందిలే' 'ఆమె నా కొరకు వచ్చింది.' 'మరి నేనెవరికోస మొచ్చానను కుంటున్నావు?' కొంటెగా నవ్వుతూ ప్రశ్నించాడు. 'మీ రెవరికోస మొచ్చినా మీతో మాట్లాడేందుకు చాలామంది వున్నారు. కాసేపు ఇందిరతోనో, అన్నయ్యతోనో మాట్లాడుతూ వుండండి' అంది విసవిసా నడిచిపోతూ. ఆ తర్వాత అతని ముఖం కొంత కళావిహీనం కావటం గమనించి కూడా తాను కలుగ చేసుకోలేదు. ఆ సంఘటన నొక్కసారి కళ్ళముందు మెదిలింది. ఏమిటో ఆలోచనలు ముసురుకొనే వేళ ఇందిర వచ్చి 'పదక్కా! ముగ్గురం కల్సి కాసేపు పేకాడదాం' అంది. కొండంత ఆనందంగా లేచిన యామినికి కాస్సేపు ఆడిన తర్వాత వాళ్ళిద్దరి మధ్యా ఒంటరిగా తానేదో వెలితిగా తోచింది. 'మీరు ఆడుకోండి. నిద్ర వస్తోంది నాకు' అని లేచి వెళ్ళిపోయింది.

ఆ రాత్రిసుందరం సినిమాప్రోగ్రాం వేశాడు. యామిని సంతోషంతో బయల్దేరింది. ముగ్గురూ ఉత్సాహంగా

---

● ఒక పెద్దమనిషి దాదాపు తనంత పొడుగున్న గోడ గడియారాన్ని రిపేరు చేయించడానికి షాపుకు తీసుకెడుతూ బజారులో ఎదురుగా వస్తున్న ఇంకో పెద్దమనిషికి ఢీ కొట్టాడు. రెండో ఆయన కిందపడిలేచి కోపంగా 'అంత పెద్ద గడియారం పట్టుకుని తిరక్కపోతే శుభ్రంగా రిస్టువాచీ పెట్టుకో గూడదుటయ్యా!' అన్నాడు.

బయల్దేరారు. సినిమా చూస్తున్నంత సేపూ ఇందిర, సుందరంల మాటలకు మితంలేదు క్షణానికోమాటు నవ్వుకోడం, వెంటనే గుసగుసలు. అసలు తనున్న సంగతి మరిచిపోయినట్లుంది. ఏదో ఆనందం వెతుక్కుంటూ వచ్చిన యామినికి అదిమరింత దూరమైంది. తాను మర్చిపోవాలనుకున్నదేదో తన హృదయాన్ని తట్టి లేపుతోంది. జీవితంలో మొట్టమొదటిసారిగా యామిని నిస్పృహ, వేదన, ఒంటరితనం అనుభవించింది.

## 7

ఇందిర, సుందరంల చిరునవ్వుల మతాబాల వెలుగుతో, యామిని హృదయాంతరంలో భావసంఘర్షణపు టపాకాయ చిటపటతో దీపావళి గడిచి పోయింది. పండుగెళ్ళిన మరునాడు భర్త వెంట తానూ బయల్దేరింది ఇందిర. యామినికది మరింత ఆశ్చర్యజనకమూ, బాధాకరమూ అయింది. "అదేమిటి. రాక రాక వచ్చావు. ఒక్క పదిరోజులుండిపో" అన్నది తల్లి.

"నీకు తెలియదమ్మా. నేను లేకపోతే చాలా ఇబ్బంది పడ్తారు ఆరోగ్యం పాడవుతుంది. నన్ను వెళ్ళనీ" అంది ఇందిర. తల్లి మరి మాట్లాడలేదు! యామిని ముభావంగా వూరుకుంది. కానీ మనస్సులో ఒకసారి "అన్నయ్య జ్వరం పడ్డాడు. తానే చెయ్యి కాల్చుకుంటున్నాడు" అన్న కుముద మాటలు మెదిలాయి. మనస్సుని ఎవరో పట్టి నలిపినట్లయింది. ఇందిర సూట్‌కేస్ సర్దుతూ "అదేమిటక్కా అలా వున్నావు. ఈసారి సంక్రాంతికి వస్తాగా. నీవూ తప్పక రా. కానీ ఈసారి బావని బయల్దేరతీయాలి" అంది. యామిని ఒక్క క్షణం ఆగి "మనం కల్సుకుని చాలా కాలమయింది. అమ్మ బ్రతిమాలుతోంది కూడా. ఒక్క నాల్గురోజులుండకూడదూ" అంది. ఇందిర చిన్నగా నవ్వుతూ "నీకు తెలియదక్కా. ఆయనకి దగ్గర కూర్చుని పసిపిల్లాడికి తినిపించినట్లు తినిపించాలి. ఆ ఒక్క విషయమే కాదు చివరికి బట్టలు కూడా ఇవి వేసుకోండి అని తీసిస్తేగాని జరుగదు. అయినా నీకు తెలియనిదేముంది కనుక. అసలు సంగతి ఆయన నన్ను విడిచి ఒక్కక్షణం కూడా వుండలేరు." అంది చివరి మాటలకు కొద్దిగా సిగ్గుపడుతూ. అంతటితో ఆగక "నీ ప్రయాణమెప్పుడు!" అంది. యామిని కఠినంగా "నే నిప్పుడప్పుడే వెళ్ళదల్చుకోలేదు. అయినా అతనికి నువ్వింత బానిసవవుతావనుకోలేదు." అంది అక్కడినుండి లేస్తూ. ఇందిర అక్క మాటలకు నిర్ఘాంతపోయి చటుక్కున పెట్టె సర్దటమాపి దగ్గరకొచ్చి కాస్త గంభీరంగా "అదేమిటక్కా! జీవితంలో ఒకరి మాటను ఒకరు వినటం, భర్త కోర్కెను పాటించడం, భార్య సలహాను ఆచరించడం ఇవి బానిసతనమనుకుంటే బ్రతుకే ఒక పెద్ద



పదతి, వ్యాపారంక్రింద తయారవుతుంది అని ఒక్కక్షణమాగి "నాకంటె పెద్దదానివి. చెప్పవలసినదాన్ని కాదు. కానీ ఒక్కటిమాత్రం నిజం! భార్యాభర్తలలో వుండవలసింది ఆత్మీయతాజ్ఞానం, ఒకరినొకరు అర్థంచేసుకోగల హృదయ సంస్కారం. అంతేగానీ హెచ్చు తగ్గులు కాదక్కా" అంది గంభీరంగా. అప్పటికే యామిని గదిగుమ్మం దాటుతోంది.

ఇందిర బండెక్కబోయే ముందు యామిని దగ్గరకొచ్చి ఎప్పటి చిరునవ్వుతో "ఇందాకటి మాటలకు కోపగించుకున్నావా అక్కా. ఏమైనా హద్దుమీరితే క్షమించు. కానీ అమ్మ చెప్పింది. నీవు వచ్చి అప్పుడే నెలదాటుతోందని. త్వరలో వెళ్ళిపో. పాపం బావ ఒక్కడూ ఏం కష్టపడుతున్నాడో!" తిరిగి ఈ చివరి మాటతో యామినిలో స్వాతిశయం, అభిమానం తలెత్తాయి. విసురుగా "అలా ఒకరిపై ఒకరు బెంగపెట్టుకుని విడిచి వుండలేనంత స్థితికి నేమింకా రాలేదు" అంది. ఇందిర మాట్లాడక వెళ్ళిపోయింది. కాని యామినికి తన మాటలు తనకే వికృతంగా తోచాయి. భర్త తన్ను వదిలి వుండలేడని చెబుతున్నపుడు ఆమె మాటలలో యెంతటి విజయగర్వం! పరోక్షంగా తమ మధ్యగల అగాధాల్ని చెబుతున్నపుడు తనలో కన్పించినదెంత హీనభావం!

## 8

రోజులు గడుస్తున్నాయి. యామినిలో ఇదివరకటి వుత్సాహం లేదు. అనుక్షణం ఇందిర మాటలు, వారిద్దరి దాంపత్య సౌఖ్యమే గుర్తుకు వస్తున్నాయి. కానీ తన పట్టుదల, అణుమాత్రం సడలలేదు. దానికిదీటుగా శైలేంద్ర ఎటువంటి వుత్తరాలూ వ్రాయక పోవటం అగ్నికి ఆజ్యం పోసినట్లు ఆమెలోని అభిమానాగ్నిని రేపుతోంది. కానీ తనలోని రోషం, అభిమానం తననెంత పతనావస్థకు తీసుకెళ్ళుతున్నాయో ఆమె గమనించటలేదు. దానికి తగ్గట్లు అల్లుడి దగ్గరనుండి ఎటువంటి జాబులు లేక పోవడం, కూతురు ముభావంచూచి తలితండ్రులు విసిరే అనుమానపు మాటలు, చూడ్కులు మరీ బాధాకరంగా వున్నాయి. తల్లి మధ్య మధ్య ఏనీ విన్పించకుండా "ఏమిటో ఎవరి తత్వం వాళ్ళది. మొగుణ్ణి వదిలి రమ్మంటే ప్రాణం పోతుందంటుంది. అది. వెళ్తానన్న మాటేరాదు దీని దగ్గరనుండి" అని గొణుక్కుంటుంది. ఒకనాడు తలిదండ్రులు వేసిన ప్రశ్నకి మిన్నంటిన కోపంతోనూ, రోషంతోనూ, అభిమానంతోనూ "నే నిక్కడుండడం కష్టంగావుంటే చెప్పండి పోతాను. అంతేకానీ నన్ను రెచ్చగొట్టద్దు. నా జీవితం ఎట్లా నడుపుకోవాలో నాకు తెలుసు" అంది.


కూతురి పట్టుదల, గుణం తెలిసిన తల్లి తండ్రి మళ్ళీ మాట్లాడలేదు. కానీ వారి హృదయాల్లోనూ ఏమవుతుందో అన్న శంక. కానీ మధ్య మధ్య శైలేంద్రదగ్గరనుండిమామగారికి వచ్చే వుత్తరాలు కొంత వుపశాంతి నిస్తున్నాయి.

ఎంత సరిపెట్టుకున్నా యామినిలో ఏదో వెలితి, దిగులు ఆరంభమయ్యాయి. 'లేదు. నాకేం లోటు? నేను చాలా తృప్తిగా వున్నాను, మగవాడి దురహంకారానికి బలి కావటానికి నేను పశువును కాదు' అనుకుని తృప్తి పడేది. కానీ వెంటనే ఏదో నిరాశ ఆవరించేది. దానికితోడు అప్పుడప్పుడు తన గత దాంపత్య జీవితంలోని మధుర స్మృతులు గుర్తుకువచ్చి చక్కిలిగింతలు పెట్టేవి. శైలేంద్ర గాంభీర్యం, అప్పుడప్పుడు తను విసిరే కొంటె మాటలూ, ఎటువంటి సంఘటనసైనా నిదానంగా యోచించి క్షమించడం, అతని ఔదార్యమూ, విశాల దృక్పథం, తన యెదురుగా నిలిచి 'నువ్వు తప్పు చెయ్యటల్లేదా' అని ప్రశ్నిస్తున్నట్లుండేది. ఉన్నట్లుండి ఒకప్పుడు 'అన్నయ్య దేముడు. అతని మనస్సు నొప్పించక'న్న కుముద పలుకులు గుర్తుకు వచ్చేవి. 'దాంపత్య జీవితానికి కావలసింది ఆత్మీయతాజ్ఞాన మక్కా' అని ఇందిర బోధ చేస్తున్నట్లుండేది. ఏదో తెలియని అసంతృప్తి మనస్సంతా వ్యాపించింది. అప్పుడప్పుడు నిద్రాణమై అప్పుడే మేల్కొంటున్న అంతర్వాణి 'నే తప్పు చేశానేమో' అని ఆమెచే ఆలోచింప చేసేది. కాని మరుక్షణమే నరనరాల్లో జీర్ణించుకుపోయినఅహం, దురభిమానం 'లేదు నీ తప్పేంలేదు' అని కుతర్కం చేసేవి. ఈ విధమైన ద్వంద్వ భావాలమధ్య కొన్నాళ్ళు గడిచాయి. కానీ యామిని ఎటువంటి నిర్ణయం తీసుకోలేక పోయింది. అసంతృప్తి పారద్రోలలేక పోయింది కూడా.

ఆ రాత్రి మామూలుగా భోజనం చేసి పడుకుంది చాలాసేపటి వరకు ఆలోచనలతో విసుగెత్తి చివరకు నిద్ర కుపక్రమించింది. ఒకటి – రెండు మూడు– నాలుగు. ఉలిక్కిపడి లేచింది యామిని. మంచంమీద తిన్నగా పడుకున్నతాను బోర్ల బొక్కగా పడుకుని వెక్కివెక్కి ఏడుస్తూంది. ఇది నిజమేనా? అయితే తాను కన్నది కలకాదు. తన హృదయం నిజంగానే స్పందించిందన్నమాట. లేచి టైమ్ చూసింది. నాలుగున్నర. అంటే తెల్లవారుఝామున వచ్చినకలలు నిజమవుతాయంటారు. ఐతే యిది...? యామిని మరో మారు హృదయ పూర్వకంగా యేడ్చింది. అంతవరకూ నిద్రాణమైవున్న స్త్రీత్వం, ప్రేమ, హృదయం ఒక్కసారిగా మేల్కొన్నాయి. గతంలోకి దృష్టి సారించింది. తన ప్రవర్తన కళ్ళకు కట్టినట్లుగుపిస్తోంది. ఇందిర ... తన చెల్లెలు ... భర్త ఆశయాలకీ, అభిరుచులకీ అనుగుణంగా మారిపోయింది, భర్త కోర్కె తీర్చటమే పరమావధిగా యెంచుకుని జీవితం








లోని సుఖాన్ని, శాంతిని అనుభవిస్తోంది. తాను భర్త అనురాగ పూరితమైన అధికారాన్ని బానిసతనంగా యెంచుకుని ఆనందాన్ని శాంతినీ దూరం చేసుకుంటోంది. ఒక్కరోజు తన చేత్తో అన్నం పెట్టకపోతే ఆరోగ్యం పాడవుతుందని ఆందోళన చెందింది ఇందిర. భర్త జబ్బుచేసి పథ్యంచేసే దిక్కు లేకపోతే తన హృదయం కదలలేకపోయింది. తనకి నప్పవని తెలిసినా అలంకరణలో తన అభిరుచి మార్చుకుంది. నిండు కోర్టులో అందరి ముందూ అతని మాటను నిరసనగా తోసేసింది తను. ఇలా ...యిలా ఎన్నో సంఘటనలు, అనుభవాలు యామినిని మొదలంటా కదిల్చివేస్తున్నాయి. తానెన్నడూ అతని నర్థం చేసుకోడానికి ప్రయత్నించలేదు. అతనికోర్కె తీర్చటానికి యిష్టపడ్లేదు. బాధ, పశ్చాత్తాపం, వేదన ఒక విధమయిన భయం యామినిని నిలువనివ్వ లేదు. అలా అలా యోచిస్తూ ఏడుస్తూ అలసిపోయిన యామిని తెలతెల వారుతుండగా తిరిగి నిద్రపోయింది కానీ ఈ నిద్ర నిశ్చింతతో పోయినదికాదు, అవ్యక్తమయిన పరిస్థితిలో పోయినది.

ఆమె హృదయంలో మారుమూల నీలినీడలు లేకపోలేదు. ఇంకా ఏ మూలో పట్టుదల, అభిమానం తలెత్తుతూండక పోలేదు. తనంతటాను వెళ్తే శైలేంద్ర లోకువచేసి తన్ను మరింత చులకన చేస్తాడేమోనన్న ఆలోచన లేకపోలేదు. అతను పిలవకుండా వుత్తరమైనా వ్రాయకుండా వెళ్ళటమా అన్న పట్టుదల సడలలేదు.

## 9

అలా వెర్రినిద్రపోయి ఏడుగంటలు దాటిం తర్వాత లేచింది యామిని. బరువుగా గదిలోంచి బయటికొచ్చింది. ఆమె కళ్ళు బరువుగా, నీరసంగా, అలసటగా వున్నాయి. ఆమె ముఖంలో ఎన్నో అర్థంకాని విడీవిడని భావాలున్నాయి. ముఖం కడుక్కొని హాలులో కొచ్చేసరికి తండ్రి క్రితం రోజు వచ్చిన టపాలు చూచుకుంటున్నాడు. కూతుర్ని చూడగానే ఒక్క క్షణం ఆశ్చర్యపోయినా 'ఇదిగో నమ్మా నీకు లెటర్ వచ్చింది' అని అందించాడు. యామిని సాశ్చర్యంగా అందుకుని చూచింది. ఆమె కళ్ళల్లో వెయ్యి జ్యోత్స్నలు వెలిగాయి. ఒక్కసారిగా ఎక్కడలేని సత్తువా వచ్చింది. ఒక్క పరుగున గదిలోకి పోయి విప్పటం మొదలుపెట్టింది. అకస్మాత్తుగా ఆమె ఆనంద ప్రవంతి ఆగిపోయింది. ఏదో తెలియని భయంతోటి, అవ్యక్తమయిన ఆందోళనతోటి మనస్సు వెనుకాడింది. చివరికి తెగువ చేసుకుని విప్పింది. సుదీర్ఘమయిన లేఖ అది. ఆశ — నిరాశల మధ్య కొట్టు మిట్టాడుతూ అది చదవటం మొదలు పెట్టింది యామిని.

'ఉత్తరం చూచి ఆశ్చర్య పడుతున్నావో, ఆనందిస్తున్నావో, కోపగించుకుంటున్నావో, ఎటువంటి అనుభూతిపొందుతున్నావో వూహించలేను. అయినా నేనుచెప్పదలచుకున్న నాలుగు ముక్కలు ఈ విధంగానైనా చెప్పదలచుకున్నాను.

చిన్న చిన్న చినుకులే గాలివాన అయినట్లు, చిన్న విషయాలకి జీవితాలు నాశనం కావటం నాకిష్టం లేదు. ఇప్పటికే మన యిరువురి గురించి రభసలు చెలరేగుతుండవచ్చు. కానీ అవి సర్దివేయగల ఓర్పు, నేర్పు మన యిరువురికి వుండాలి. మహాప్రవాహంలో గులకరాళ్ళకున్న విలువ చాలా తక్కువ. అలాగే అర్థం చేసుకోవడంలో గలిగే అపార్థాలవల్ల జీవన ప్రవంతికి ఎటువంటి ఆటంకం రాకూడదని నా భావన. ఆవేశం, అభిమానం, అతిశయం, ఆలోచన వినాశనానికి హేతువు. అలాగే అనురాగం వినాశకారి.

ఉద్రేకంలో మనంచేసే కొన్ని పనులకు తర్వాత పశ్చాత్తాపపడినా ఫలితం శూన్యం. అద్దం విరగకుండా వుండాలేగాని విరిగాక అతకటం అసాధ్యం. కొందరి హృదయాలు అద్దంకంటె సున్నితమైనవి.

బ్రతుకులో బంధాలు మనం వూహించినంత తేలికగా విప్పగలిగే ముళ్ళయినట్లయితే—బహుశః ప్రపంచంలో మానవుడికీ—పశు పక్ష్యాదులకీ తేడా లేకుండా పోయేదేమో. కానీ కనపడని మమతా, అనురాగం మనిషిని క్షమాభూషితుని చేస్తున్నాయి.

వైవాహిక బంధంలో ఒకరి మాటను మరొకరు మన్నించటమే గాని సతన మనుకుంటే ఎన్ని వివాహాలు విజయవంతమవుతాయో ఆలోచించి చూడు. ఒకరి భావాలు మరొకరు పంచుకోలేని నాడు తోడు-నీడ అనే పదానికి సార్థకం వుండదనుకుంటాను. ఆ బంధమే నిరర్థకం. విశాల హృదయంతో తరచి చూడు. సత్యం నీ కంటికే కన్పిస్తుంది.

నేను తిరిగి జ్వరంపడ్డాను. ఇంకా కోలుకోలేదు. ఈ వుత్తరాన్నే ఆహ్వానంగా భావించి త్వరలో వస్తావనుకుంటాను.

కానీ యామినీ! ఒక్క విషయం ఎన్నడూ మరిచిపోకు. ఆత్మగౌరవం అనేది ప్రతి వ్యక్తి హృదయాంతరాలలో కనిపించకుండా వెలిగే నివ్వురవ్వలాటిది. అది అనుక్షణం ప్రజ్వలిస్తూనే వుంటుంది. నా అంతట నేనే వుత్తరం వ్రాశానని నన్నొక చేతగానివానిగా భావించి మరింత చులకనగా ప్రవర్తించకు. నాలోని వ్యక్తిత్వపు విలువల నర్థం చేసుకోడానికి యత్నించు. ఇంతకన్న చెప్పదగ్గదేమీ లేదు. నీ నిర్ణయం పైనే నీ జీవిత వసంతంకూడా ఆధారపడి వుంటుంది.

— నీ శైలేంద్ర.'

ఉత్తరం చదివిన యామిని కళ్ళనుండి నీళ్ళు జలజలరాలాయి. ఆమె హృదయంలో ఇప్పుడే నీలినీడలూ లేవు. వర్షానంతరం కనిపించే వినీలాకాశంలా ప్రసన్నంగా, ప్రశాంతంగా వుంది. పరుగున తండ్రి దగ్గరకు వెళ్ళి 'నాన్నా! ఈరోజు ప్రయాణానికి ఏర్పాట్లుచెయ్యి.' అంది నిశ్చలంగా. తండ్రి ఆశ్చర్యంగా తలెత్తి 'అదేమిటమ్మా అంతతొందర. ఉన్నన్నాళ్ళు వుండి తీరా అమావాస్య పూటనా ప్రయాణం!' అన్నాడు. యామిని మృదువుగా నవ్వుతూ 'నా హృదయాంతరాలలోని అమావాస్య చీకట్లు చెదిరిపోయాయి. ఇక అమావాస్య నన్నేం చేస్తుంది' అంది నిబ్బరంగా.

□□□